# సత్యం శివం సుందరం



## సత్యం మందపాటి

## అమెరికా కథలు

**“Satyam Sivam Sundaram”**

**An Anthology of Short Stories By Satyam Mandapati**

**Satyam Mandapati e-Books**

**సాహిత్య సౌరభం : 15**

**Language: Telugu**

August, 2017

Copy Right: Satyam Mandapati

Telugu Typesetting: Satyam Mandapati and Ujwal Manepalli

For Print Book Copies in India:

Visalandhra Book House and other Book Shops

Lakshmi Srinivasa Publishers, Hyderabad
Mobile: 9848813249

Contact in India:

V. Sri Lakshmi,
1-1-231/4, First Floor, Jyothi Bhavan, Chikkadpalli,
Hyderabad 500020
Phone: (040) 27651264

For Print Book Copies in USA:

Email: satyam_mandapati@yahoo.com

Price: Rs 130/-

# వావీ... వరసా...


1. సౌమ్య
2. సాధించవే మనసా
3. కరణేషు మంత్రి
4. నిన్ను నిన్నుగా ప్రేమించు
5. మరణ ముహూర్తం
6. నమ్మకమా, నిన్ను నమ్మవచ్చా?
7. సత్యం శివం సుందరం
8. చిలుక పచ్చ సిలుకు చీర
9. అరిచ్చెందర మాత్తర్లు
10. జీవితమే సఫలము
11. పూలు లేని కాడలు
12. జోయాన్
13. గజగామిని
14. మాతృత్వానికి మరో మణిహారం
15. కార్యేషు దాసి
16. కుంతి – కుమారి
17. జాలి
18. నాతిచరామి
19. ఉమారమణీయం
20. భోజ్యేషు మాత
21. అమ్మ కడుపు చల్లగా
22. మరో ప్రస్థానం
23. సంధ్యావందనం
24. హారతి
25. బృందావనం
26. వెళ్ళొస్తానండీ!

# సాధించవే మనసా!

'నేను ఇంతకన్నా ఏమీ చేయలేను. 9/11 తర్వాత మా రూల్సులో చాలా మార్పు వచ్చింది' అంది ఎయిర్ పోర్ట్లో గేటు దగ్గర అమ్మాయి.

'ఇది ఆరోగ్యానికి సంబంధించిన అత్యవసర పరిస్థితి' అంది భవాని ఇక ఎలా వాదించాలో అర్థం కాక.

'అవును. నాకు పూర్తిగా అర్థమయింది. మీ స్థానంలో వుంటే నేనూ మీలాగే నిరుత్సహపడేదాన్ని. నేను రూల్స్ పాటించే మనిషినే కానీ... రూల్స్ పెట్టిన మనిషిని కాదు...' అందామె నొచ్చుకుంటూ.

ఈలోగా విమానం బయల్దేరుతున్నదంటూ గేటు మూసేశారు.

'నేను మా మేనేజ్మెంటుతో మాట్లాడతాను. నాలుగు గంటల్లో లండన్కి ఇంకో ప్లేను వుంది. నా చేతనైన సహాయం చేస్తాను. నన్ను నమ్మండి' అంది ఎయిర్ లైన్స్ ఏజెంటు క్షమాపణగా, భవాని చేయి మృదువుగా వత్తుతూ.

భవాని ఏమీ చేయలేక, బరువుగా బయల్దేరుతున్న విమానాన్ని అద్దాల కిటికీలలో నించే చూస్తూ నిట్టూర్చింది.

సెల్ ఫోన్లో మురళిని పిలిచి, జరిగిందంతా చెప్పింది.

'అరెరె! అలా ఎందుకు జరిగింది. నన్ను రమ్మంటావా....' అతను గాబరా పడుతున్నాడు.

'అఖ్ఖర్లేదు. తర్వాత ఫ్లైట్లో ప్రయత్నం చేస్తున్నాను. అది తెలియగానే మళ్ళీ ఫోన్ చేస్తాను' అంది భవాని.

'మరి మనం లండన్కి వెళ్ళటం లేదా?' అని అడిగింది, భవాని చేయి పట్టుకుని నుంచున్న పదేళ్ళ సంధ్య.

'లేదమ్మా. వెడతాం. కాకపోతే దీంట్లో కాదు... తర్వాత వెళ్ళే విమానంలో...' అంది సాధ్యమైనంత వరకూ తన నిరుత్సాహం పైకి కనపడకుండా.

సంధ్య చేయిని గట్టిగా, ఆప్యాయంగా పట్టుకుని అక్కడే వున్న కుర్చీలో కూలబడింది. తను అనుకున్నది అనుకున్నట్లుగా జరుగుతుందా? అలా జరగకపోతే

సంధ్య సంగతి ఏమిటీ? తట్టుకోగలదా? ఆలోచనలు ముసురుతుంటే, అలసటగా కళ్ళు మూసుకుంది.

మురళితో పెళ్ళయ్యాక ఇండియానించీ అమెరికా వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. తనూ మురళి కనీసం ఒక కూతురుంటే బాగుంటుందని అనుకున్నారు. ఇద్దరికీ అమ్మాయి కావాలనుకుంటే అబ్బాయి పుట్టాడు. రవికి మూడేళ్ళు వచ్చాక, కావాలనుకున్నట్టుగానే ఈసారి సంధ్య పుట్టింది. అందమైన రూపురేఖలు, చలాకీతనం, మంచి తెలివితేటలు... అంతకన్నా కావల్సిందేముంది. సంధ్య పుట్టాక ప్రతీరోజు ఇంట్లో సందడే, పండగే. ఇంట్లో ముగ్గురికే కాక, మిత్రులకీ, ఇరుగూ పొరుగూ అమెరికన్లకి కూడా గారాల పట్టి అయిపోయింది. సంధ్యకి నాలుగేళ్ళ వయసు వచ్చాక చిన్న పిల్లలు వేసే బొమ్మలు కాక రకరకాల చిత్ర పటాలు వేయటం చూసి అందరూ అబ్బురపడేవారు.

'సంధ్య పెద్దయాక బాపూగారిలా మంచి చిత్రాలు గీస్తుంది. అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంటుంది' అనేవాడు మురళి.

జీవితం సాఫీగా సంతోషంగా జరుగుతున్నప్పుడే, ఆకాశంలోనుంచీ పిడుగు పడ్డట్టుగా, ఒక్కసారిగా తమ జీవితం, ఆశలూ, ఆనందాలూ తల్లక్రిందులయాయి.

ఆలోచనలలో మునిగివున్న భవాని, తన చేతి మీద సంధ్య చేయి బిగుసుకుపోవటంతో. ఉలిక్కిపడి సంధ్య వైపు చూసింది. సంధ్యకి ఊపిరి ఆడటం లేదు. ఏం కావాలో చెప్పకనే, ఆ పిల్ల కళ్ళు చెబుతున్నాయి. వెంటనే పక్కనే వున్న సంచిలోంచి ఆక్సిజెన్ సిలిండర్ తీసి, చకచకా సంధ్య ముక్కుకి ట్యూబ్ తగిలించింది. రెండు క్షణాల తర్వాత, సంధ్యకి మళ్లీ సవ్యంగా ఊపిరి అందుతున్నది.

'ఇప్పుడు బాగుందా నాన్నా?' అని అడిగింది.

సంధ్య చిరునవ్వు నవ్వి, బాగానే వుందని తల వూపింది. ఆ నవ్వే భవానికి, ఎంత బాధగా వున్నా సేద తీర్చేది. భవాని కుర్చీలో వెనక్కి జారిగిలబడి, కళ్ళు మూసుకుంది.

సంధ్యకి నాలుగేళ్ళు దాటినా పెరుగుదల వయసుకి తగ్గట్టుగా లేనే లేదు. అప్పటిదాకా బాగానే వుంది అనుకుంటున్న సంధ్య, వయసుకి తగ్గ ఎత్తు రాలేదు. ఎదగటం మానేసినట్టుంది. చక్కగా నల్లగా, ఒత్తుగా వున్న జుట్టు ఊడిపోవటం

# మరణ ముహూర్తం

ఆ రోజు రాత్రి డైనింగ్ టేబుల్ దగ్గర కుర్చుని భోజనం చేస్తున్నప్పుడు అడిగాను గిరిజని, 'ఎలా వుంది ఇవాళ మీ ఆఫీసులో!" అని.

గిరిజ మా ఊళ్ళోనే, స్టేట్ ప్రిజన్ సిస్టంలో కౌన్సిలింగ్ సైకాలజిస్ట్గా పని చేస్తున్నది.

'ఇవాళా? ఒక చిన్న విశేషం వుంది' అని ఒక్క క్షణం ఆగింది.

గుత్తి వంకాయ కూర తింటూ ఆమె వేపు చూశాను.

'మన ఇండియన్స్లో కూడా ఇలాటి వాళ్ళు వుంటారనుకోలేదు!' అంది హఠాత్తుగా.

నేనూ మాట్లాడలేదు, ఆమె ఆలోచనలకూ అడ్డు రాకుండా వుండాలని.

తనే చెప్పటం మొదలుపెట్టింది.

'సునేత్ర అని ఒక ఒరిస్సా అమ్మాయి. అమెరికన్ సిటిజెనే. ఇక్కడే మెక్కాలెన్ అనే ఊళ్ళో వుంటుంది. ఆ అమ్మాయి మొగుడ్ని కాల్చి చంపేసింది. మరణ శిక్ష విధించారు. డెత్ రోలో వుంది'

నాకు ఆశ్చర్యమే కాక, కుతూహలం కూడా పెరిగింది.

'మొగుడ్ని కాల్చేసిందా? ఎందుకు? ఎన్నేళ్ళావిడేమిటి?' అడిగాను.

'ఆ అమ్మాయికా? ముప్పై ఏళ్లుంటాయి. ఇద్దరం ఇండియన్ ఆరిజిన్ వాళ్ళమే కనుక, కౌన్సిలింగ్ చేయటానికి బాగుంటుందని ఆ కేసుకి నన్ను ఎసైన్ చేశారు. నాకింకా ఆమె కేస్ ఫైల్ ఇవ్వలేదు. ఇప్పటిదాకా తెలిసిందేమిటంటే మొగుడ్ని చంపేసిందని. ఆ అమ్మాయి అలా అని ఒప్పుకుందిట కూడాను. అందుకే కేసు తొందరగా తేలిపోయింది. డెత్ రోలో వుంది! అంటే కొన్నాళ్ళు మా జైల్లోనే వుంటుంది. తర్వాత ఆమె జీవితం ఎప్పుడు అంతం చేసేది నిర్ణయిస్తారు'

'అరె పాపం! ఎందుకు చేసింది అలాటి పని! ఏదో బలమైన కారణమే వుండి వుంటుంది. ఆ అమ్మాయి మొగుడు ఇండియనా, అమెరికనా?' అడిగాను.

చిన్నగా నవ్వింది గిరిజ. 'తెలీదు. ఆ ఫైల్ నాకు రేపు ఇస్తారు. అప్పుడు చెబుతాను అన్నీ వివరంగా', ఒక్కక్షణం ఆగి మళ్ళీ అంది 'కానీ అవన్నీ కాన్ఫిడెన్షియల్ ఎవరితోనూ ఎక్కడా అనకు' అంది భార్య హోదాలో.

'నేనెందుకు చెబుతాను. నా సంగతి నీకు తెలీదూ!' అన్నాను నన్ను అనుమానంగా చూస్తున్న గిరిజతో.

నా మాట విని సన్నగా నవ్వింది.

'మన పెళ్ళయిన పదిహేనేళ్ళలోనూ నా మీద నీకున్న నమ్మకం ఇంతేనన్నమాట. పోనీ ఒక పని చేయి. పబ్లిక్ ఇన్ఫర్మేషన్ మాత్రమే చెప్పు. ఉద్యోగరీత్యా చెప్పకూడనివి చెప్పకు' అన్నాను.

మర్నాడు సాయంత్రం వర్క్ నించీ వచ్చి వంట చేస్తున్నది గిరిజ, నేను ఆఫీసు నించీ వచ్చేసరికీ. బ్రీఫ్ కేస్ సోఫాలో పడేసి, ఫ్రిడ్జిలో నించీ ఒక గ్లాసెడు చల్లటి మంచి నీళ్ళు తీసుకుని, ఆమె ఎదురుగా నుంచుని 'ఏమిటి కబుర్లు?' అన్నాను.

'ఏముంది... ఫ్రీజ్ చేసిన బీరకాయలు వుంటే, నీకు ఇష్టమని ఇవాళ బీరకాయ కూరా, బీరకాయ పచ్చడి, బీరకాయ పప్పు చేస్తున్నాను. సాంబారులో కూడా బీరకాయ వేద్దామా వద్దా అని ఆలోచిస్తున్నాను. నీ సలహా ఏమిటీ?' అంది కొంటెగా నవ్వుతూ.

గిరిజ భుజాల మీద నించీ భయపడుతూనే తొంగి చూశాను స్టవ్ దగ్గర వున్న మూడు గిన్నెలనీ. బెండకాయ కూర, టమాటా పచ్చడి, మామిడికాయ పప్పూ.

నేను నవ్వుతూ అన్నాను 'సరే కానీ. నాకిష్టమని నువ్వు కష్టపడి చేస్తుంటే, నేను వద్దనటం ఎందుకు. సాంబారులో కూడా వెయ్యి బీరకాయ ముక్కలు. సో, హవ్ ఈస్ యువర్ డే!'

'షరా మాములే' అంది. సాంబారులో చిలకడదుంప ముక్కలు వేస్తూ.

'మా ఆఫీసులో కూడా అంతా మాములే! ఇవాళ ఎవడో కష్టమాసురుడు మా ప్రాడక్ట్ క్వాలిటీ గురించి ఏదో కంప్లైంట్ చేశాట్ట. అది నాకు అప్పచెప్పారు. కష్టమర్ శాటిస్ఫాక్షన్ ముఖ్యం కదా!' అన్నాను.

మా ఆఫీసులో నా బల్ల మీద ఒక బోర్డు వుంది. 'రూల్ నెంబర్ వన్ – కష్టమర్ ఈజ్ ఆల్వేస్ రైట్. రూల్ నెంబర్ టు – ఇఫ్ కష్టమర్ ఈస్ రాంగ్ సీ రూల్ నెంబర్ వన్' అని.

# సత్యం శివం సుందరం

శనివారం సాయంత్రం సుందరీ, సుందరం ఇండియన్ గ్రోసరీ షాపుకి వెళ్ళినప్పుడు చూశారు ఆ కొత్త జంటని.

కొత్త జంట అంటే వయసులో వున్న జంటని కాదు. వయసులో బాగా పెద్దవాళ్ళే. అయన రిటైర్ అయాడేమో కూడాను. ఆవిడలో వయసు అంతగా తెలియక పోయినా సౌమ్యంగా, అందంగా, హుందాగా వుంది.

వాళ్ళని ఆ వూళ్ళో చూడటం అదే మొదటిసారి. కొత్తగా వచ్చినట్టున్నారు.

ఆవిడ సుందరిని చూసి పరిచయ పూర్వకంగా నవ్వింది.

సుందరీ, సుందరం వాళ్ళ దగ్గరికి వెళ్ళి పరిచయం చేసుకున్నారు.

ఆవిడ అంది 'నా పేరు పార్వతి. మా ఆయన శివరాం. అందరూ శివ అంటారు.'

'మీ పిల్లలు అమెరికాలో వుంటే చూడటానికి వచ్చారా?' అడిగింది సుందరి.

శివ నవ్వాడు. 'లేదు, మేము అమెరికా వచ్చి ముప్ఫై ఐదేళ్ళు అయింది. ఫిలడెల్ఫియాలో వుండేవాళ్ళం. పోయిన వారమే టెక్సస్ రాష్ట్రవాసులం అయిపోయాం' అన్నాడు.

సుందరం నవ్వాడు. 'సారీ! ఈమధ్య ఇండియానించీ పిల్లల దగ్గరికి వస్తున్న వారు ఎక్కువయిపోయారు. అందుకని అలా అనుకున్నది సుందరి' అన్నాడు.

'మా ఇల్లు ఇక్కడికి దగ్గరే. రండి వెడదాం. కాఫీ త్రాగి వెడుదురు గాని' ఆహ్వానించింది సుందరి.

'కాఫీకి పిలిచినప్పుడు రామంటే పాపమొస్తుందని మా బామ్మ చెప్పేది' అన్నాడు నవ్వుతూ శివ.

'ఎవరైనా కాఫీకి పిలిస్తే మా అయన వెంటనే ఒప్పేసుకుంటాడు' అని నవ్వింది పార్వతి.

కాసేపట్లోనే ఎన్నాళ్ళనించో తెలిసిన వాళ్ళలా దగ్గరయిపోయారు.

అక్కడ తెలిసిందేమిటంటే శివ, పార్వతిలకు ఒకే ఒక్క కూతురు శృతి. కార్డియలజిస్టుగా స్వంత ప్రాక్టీస్ పెట్టుకుంది. ఎలాగూ రిటైర్ అయిపోయారు కనుక శివ,

పార్వతులు, కూతురు ఇంటికి ఐదారు మైళ్ళ దూరంలో ఇల్లు కట్టుకుని అక్కడికి వచ్చేశారు.

దాని తర్వాత నాలుగైదుసార్లు కలిశారు శివ, సుందరం. వయసులో శివ కొంచెం పెద్దయినా సుందరంతో బాగా కలిసిపోయాడు. కాకపోతే ఒక్క విషయంలో ఇద్దరూ ఏకీభవించలేకపోయారు.

సుందరం ఆ వూళ్ళోని గుడికి ట్రస్టీగా వున్నాడు. అక్కడ గుడి కట్టటంలో కూడా ముఖ్య పాత్ర వహించాడు. అక్కడే జరిగే పూజలకే కాకుండా ఇంకా గుడి కార్యక్రమాలకి, కొత్త విగ్రహాల స్థాపనకీ, ఒకటేమిటి గుడికి సంబంధించిన ప్రతి విషయంలోనూ, ఆయన ప్రమేయం వుండాల్సిందే.

మాధవసేవ కన్నా మానవసేవ మీదే నమ్మకం కలవాడు శివ. ఇండియా లోనూ, అమెరికాలోనూ ఎన్నో లాభాపేక్ష లేని సంస్థలకు, ధన సహాయమే కాక వీలు కుదిరినప్పుడల్లా శ్రమదానం కూడా చేస్తుంటాడు. నెలకొకసారి జిమ్మీ కార్టర్ గారి హాభిటాడ్ ఫర్ హ్యూమానిటీ తరఫున, బీదవారికి ఉచితంగా ఇళ్ళు కట్టి ఇచ్చే కార్యక్రమంలో కొన్ని శనాదివారాల వారంతాలు, తను చేయగలిగిన పనులు చేస్తే కానీ ఆయనకి తృప్తి వుండదు.

గుడిలో ప్రతిష్ఠించబోయిన సుబ్రహ్మణ్యస్వామి వారి కొత్త విగ్రహం కోసం చందా అడిగినప్పుడే, సుందరానికి శివ గురించి ఆ విషయం తెలిసింది. తనకి దేవుడున్నాడనే భావన మీద నమ్మకం లేదనీ, గుడికి డబ్బులు ఇవ్వననీ కూడా చెప్పాడు.

'దేవుడు లేడని మీరు ఎలా అంటారు? మరి మీరూ, నేనూ, ఈ సృష్టి ఎక్కడనించీ వచ్చాయని మీ ఉద్దేశ్యం' అడిగాడు సుందరం.

చిన్నగా నవ్వాడు శివ. 'నేను దేవుడు వున్నాడనే వాదం మీదా, లేడనే వాదం మీదా ఎన్నో పుస్తకాలు చదివాను. మాములుగా చదవటం కాదు, విశాల దృక్పధంతోనే చదివాను. నిజం తెలుసుకోవాలన్న ధృఢ నిశ్చయంతోనే చదివాను. చదివి ఈ విషయం మీద నా భావనలని ఏర్పరచుకున్నాను. మీరూ అలాగే చేసివుంటారని అనుకుంటున్నాను. అటువంటప్పుడు, ఒకరి భావాలని ఇంకొకరు గౌరవించటం మంచిది కదూ!' అని, ఆ విషయం మీద తనతో వాదోపవాదాలు అనవసరం అని సూచించాడు శివ.

# జీవితమే సఫలము

నా అరవై రెండో ఏట, మళ్ళీ వైజాగ్ లోని ఆంధ్రా యూనివర్సిటీలో అడుగు పెట్టాను. అంటే అక్కడే నేను మెకానికల్ ఇంజనీరింగులో ఎం.ఇ. చేసిన నలభై సంవత్సరాల తర్వాత.

నేను ఎం.ఇ. పూర్తి చేయగానే తిరువనంతపురంలో విక్రం సారాభాయ్ స్పేస్ సెంటర్లో ఉద్యోగంలో చేరి అక్కడే వుండిపోయాను. పిల్లలూ, వాళ్ళ చదువులూ, ఆఫీసులో బిజీగా వుండటం, మధ్య మధ్య శెలవులకి గుంటూరుకి వచ్చినా మళ్ళీ వైజాగ్ వెళ్ళటానికి పడలేదు. ఇప్పుడు, రిటైర్ అయిన తర్వాత, మళ్ళీ వైజాగులో అడుగు పెట్టాను.

విశేషమేమిటంటే నాకెంతో ఇష్టమైన మా ఆంధ్రా యూనివర్సిటీలో మళ్ళీ విద్యార్థిగా అడుగుపెట్టాను. దీంట్లో ఆశ్చర్యం ఏమీ లేదు. జీవితం అంటేనే రోజు, ప్రతి రోజు జ్ఞానపరిజ్ఞానానికి చేసే విద్యాన్వేషణ మరి. జీవిత పాఠశాలలో మనందరం నిత్యం విద్యార్థులమే కదూ!

ఆ అబ్బాయిని మా ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఎప్పుడూ చూస్తూ వుంటాను. ఏం కోర్సులు తీసుకుంటున్నాడో తెలీదు. కానీ మొట్టమొదటిసారి చూసినప్పుడే నా దృష్టిలో పడ్డాడు.

అలాటివారే చాలామంది ప్రతిరోజు తారసపడుతున్నా, అతను నా దృష్టిని ఆకర్షించటానికి ముఖ్య కారణం అతనిలో ఏదో ప్రత్యేకత కనిపించటమే. ఏదో పోగొట్టుకున్నవాడిలా ఎప్పుడూ తల దించుకుని నేల మీద అటూ ఇటూ చూస్తుంటాడు. తల ఎత్తి ఎదుటి మనిషిని చూస్తూ మాట్లాడటం చాలా అరుదు. మాట్లాడుతున్నా తల అటూ ఇటూ తిప్పి చూస్తుంటాడే తప్ప, కళ్ళలోకి చూస్తూ మాట్లాడడు. అదీకాక పలకరించినా, పరధ్యానంగా వుంటాడు. సరైన జవాబూ రావటం కష్టమే.

అతని గురించి చెబుతున్నానే కానీ, నా సంగతో! నేను కాలేజీలో చేరిన మొదటి వారంరోజులూ ప్రతివాళ్ళూ నన్ను కొత్తగా చేరిన ప్రొఫెసర్ అనుకునేవాళ్ళు మరి. అది నిజం కాదనీ, నేనూ వాళ్ళలా ఒక విద్యార్థినే అని తెలిశాక చూడాలి వారి కళ్ళల్లోని చులకన, వ్యంగ్య ప్రవర్తన. నేను చూడనప్పుడు కనపడని నవ్వులూ, వెక్కిరింతలూ...

తర్వాత దాచుకోకుండానే ఎదురుపడి మరీ మరీ చూపిస్తున్నారు. అందరూ కాదు కానీ, ఆ పని చేసే కొందరు చాలు నన్ను ఇబ్బందిలో పెట్టటానికి. ముందు కొంచెం బాధగా అనిపించినా, నేనూ అలవాటు పడిపోయి, వాళ్ళని పట్టించుకోకుండా నా దారిన నేను పోతున్నాను.

ఆ రోజు నా మోటార్ సైకిల్ మీద లైబ్రరీకి వెడుతున్నాను.

ఎదురుగా లారీ వస్తున్నది. చూసుకోకుండా తల వంచుకుని గబగబా రోడ్డుకి అడ్డంగా వస్తున్నాడు అతను. గట్టిగా మోటార్ సైకిల్ హారన్ కొడుతూ పెద్దగా అరిచాను. అది విని లారీ కీచుమని బ్రేకులు వేస్తూ ఆగింది. అయినా ఆ స్పీడుకి ఆగలేక ముందుకి వచ్చి అతనికి తగలబోతూ వుంటే, మోటార్ సైకిల్ మీదనించే అతని భుజం పట్టుకుని లాగాను. ఇద్దరం క్రింద పడ్డాం. అతను అతని మీద నేను. మా ఇద్దరి మీద నా మోటార్ సైకిల్. లారీ అతను పెద్దగా తిట్టుకుంటూ ముందుకి కదిలాడు.

అతనికి ఎడమ భుజం మీదా, తల మీదా గాయాలయాయి. రక్తం వస్తున్నది. నాకు మోచేతి మీద కొంచెం దోక్కుపోయింది కానీ, పెద్దగా దెబ్బలేమీ తగల్లేదు.

'బాగా దెబ్బలు తగిలాయి. పద హాస్పిటల్కి తీసుకు వెడతాను' అన్నాను.

'వద్దులెండి. చూసుకోకుండా రోడ్డు మీదకి వచ్చాను. తప్పు నాదే. మిమ్మల్నీ కష్టపెట్టాను. మీ ప్రాణాన్ని కూడా లెఖ్ఖ చేయకుండా నన్ను రక్షించ బోయారు. మీకూ దెబ్బలు తగిలినట్టున్నాయి. సారీ గురువుగారూ!' అన్నాడు.

'సారీలు తరువాత. కొంచెంలో ప్రమాదం తప్పింది. ఒక్క క్షణం ఆలస్యం అయితే నీ ప్రాణం పోయివుండేది. మనం పుట్టింది చచ్చిపోవటానికి కాదు. జీవించటానికి. ముందు డాక్టర్ని చూద్దాం పద' అని అతన్ని దగ్గరలో వున్న క్లినిక్కి తీసుకువెళ్ళి కట్లు కట్టించి, ఆటో ఎక్కించాను.

రెండు రోజుల తర్వాత యూనివర్సిటీ కాంటీన్లో కాఫీ త్రాగుతుంటే, అతను వచ్చాడు చేతిలో కాఫీ గ్లాసుతో.

'ఎలా వుంది. బాగున్నావా?' అడిగాను.

వయసులో తేడా వల్లనేమో నువ్వు అనే అంటున్నాను మీరు అనకుండా.

అతనికి మహా అయితే ఇరవై ఏళ్ళ వయసుంటుందేమో.

అమెరికాలో సెటిలై పోయిన మా అమ్మాయికే ముప్పై ఏళ్ళ వయసు మరి.

# గజగామిని

(ఎం.ఎఫ్. హుస్సేన్ తీసిన "గజగామిని" సినిమా చూశాక ఈ కథ వ్రాయాలనిపించింది. కొన్ని ప్రముఖ పాత్రలను ఈ కథలోకి తీసుకురావటం తప్ప, ఆ సినిమాకీ ఈ కథకీ ఈ సంబంధం లేదు. కాకపోతే ఆ సినిమాలో చూపించినట్టు, కొన్ని నిజాల్ని abstract గా చెబితే ఎలా వుంటుంది అన్న ఉద్దేశ్యంతో ఈ కథని కేవలం కొంత సరదాగానూ, కొంచెం బాధతోనూ, ఊహాపరంగా వ్రాసిందే)

చిత్తుకాగితాల మీద చిత్తుగా చిత్రించిన అక్షరాలు చిత్రంగా కనిపిస్తున్నాయి.

ఒకటి.. వంద.. వెయ్యి.. లక్ష.. కోటి.. తర్వాత కోట్లు.. మరిన్ని కోట్లు... ఈలోగా బ్లాక్ అండ్ వైట్లో ఒకమ్మాయి వీపు. చాలా సన్నగా, నున్నగా, నగ్నంగా అందంగా వుంది.

"సిగ్గేస్తుందా.... సిగ్గేస్తుందా..." అన్న ఏనాటిదో ఆ పాత తెలుగు సినిమా పాటకు స్టెప్పులు....స్టెప్పులు వేస్తున్నది. కానీ ఆమె ఎవరో తెలియటం లేదు. అసలు వెనక్కి తిరిగితే కదా ముఖం చూడటానికి. ముఖం చూపించటానికి సిగ్గేస్తున్నదేమో, ఆమె ఒక గోడ వేపు తిరిగి, వీపు చూపిస్తూ డాన్స్ చేస్తున్నది. అక్కడా, ఇక్కడా రెండు మూడు గుడ్డ పీలికలు తప్ప ఆమె వీపంతా తెల్లగా నగ్నంగా మెరుస్తున్నది.

ఆమె నడక అందంగా ఏనుగు నడిచినట్టువుంది.

సైకిల్ నడిపించుకుంటూ నెమ్మదిగా వచ్చాడు ఆయన అక్కడికి. మూసి వున్న గుప్పిట, చూపుడు, మధ్య వేళ్ళ నడుమ ఒక సిగరెట్టు ఎర్ర బావుటాలా కాలుతున్నది. వచ్చి పక్కనే నుంచుని, ఆ గజగామిని నృత్యాన్ని చూస్తూ నుంచున్నాడు.

ఈలోగా ఒక పెద్దమూట బ్లాక్ అండ్ వైట్లో, ఆకాశంలోనించి నెమ్మదిగా స్లో మోషన్లో క్రింద పడుతున్నది. ఆ అమ్మాయి వయ్యారపు సొగసుల అందాలను, క్రింద పడుతున్న ఆ మూట కనపడకుండా దాచేస్తున్నది. ఆ మూట క్రింద పడగానే ఒక్కసారిగా వాతావరణం పంచరంగుల్లోకి మారిపోయింది.

ఆ పంచరంగుల మూటలోనించి పచ్చ నోట్లు, బంగారు నాణేలు, వెండి పళ్ళాలు ఎగిరి బయటపడ్డాయి. ఆ వెండిపళ్ళాల మీద పెళ్ళి పత్రికలు ముద్రించి వున్నాయి కూడాను.

ఆమె అవన్నీ గబగబా ఆబగా ఏరుకుని మూట కట్టింది. మూట పక్కన పెట్టి, మళ్ళీ నృత్యం చేయటం మొదలుపెట్టింది. అయినా ముఖం మాత్రం చూపించటం లేదు. ఆశ్చర్యమేమిటంటే, ఇప్పుడు ఆమె నడుము సన్నగా లేదు. నడుమే కాదు, శరీరంలోని ఏ భాగమూ సన్నగా లేదు. ఆమె లావుగా వుంది. బాగా లావుగా వుంది. ఆమె వెడల్పు కొన్ని గజాలు వుంది, ఏనుగులాగా. భారంగా, బరువుగా అడుగులు వేస్తూ డాన్స్ చేస్తున్నది. మొదట్లో కొన్ని స్టెప్పులు బ్లాక్ అండ్ వైట్లో సన్నటి పాదాలతోనూ, తర్వాత కలర్లో ఏనుగు పాదాలతోనూ సింబాలిక్గా కనిపిస్తున్నాయి.

అప్పుడే లాంగ్ షాట్లో నించి దగ్గరకు వచ్చాడు ఆయన. మంచి ఒడ్డూ పొడుగుతో, కాటికాపరిలా వున్నాడు. దగ్గరికి వచ్చాక కానీ తెలియలేదు. ఆయనే నట సార్వభౌమ, యశస్వి, స్వర్గీయ ఎస్వీ రంగారావు అని. తెలుగుదేశంలో పుట్టినందుకు సాటి తెలుగువాడు కనుక, ఆయన పేరుని మన గోడలు దాటకుండా భద్రంగా దాచుకుని ఎంతో జాగ్రత్తపడ్డామే, ఆయనే ఈయన. అదే ఇంకో రాష్ట్రంలోనో, ఇంకో దేశంలోనో, ఎక్కడయినా పుట్టి వుంటే, ఒకటో పదో ఆస్కారులు సంపాదించుకుని, ప్రపంచ ప్రఖ్యాత నటుడయే ఆస్కారం వుండేదాయనకి. అంత గొప్ప నటుడు మరి. ఇక్కడిలా కాటికాపరిలా వున్నాడేమిటి?

సైకిల్ మీద వచ్చి, అక్కడే నుంచుని చూస్తున్న కవిగారితో అన్నాడు ఎస్వీ రంగారావ్. “ఓహో గురువుగారా! మహాకవులు శ్రీశ్రీగారికి నమోన్నమః! మీ అనుమానమేమిటో అర్థమయింది. నేను ఇక్కడెందుకున్నాననే కదా అనుమానం. కళ్ళు మూసుకోండి. కథంతా అర్థమవుతుంది. నేను సత్యహరిశ్చంద్ర సినిమాలో కాటికాపరిలా ఎంతో బాగా నటించానని, నన్ను స్వర్గాన్నించి పిలిపించి నాకీ టెంపరరీ ఉద్యోగాన్నీ, తాళం చెవుల్నీ ఇచ్చాడు చిత్రగుప్తుడు!” అన్నాడు నవ్వుతూ ఎస్వీ రంగారావ్.

చేతిలో అగ్నిహోత్రాన్ని గుండెల నిండా పీల్చి, రుద్రాలిక నయన జ్వాలికలా పొగ వదులుతూ, ఒక్కసారి పొగ గొట్టపు భూంకార ధ్వని చేసి “ఏమిటోనయ్యా రంగారావూ. నువ్వు సెలవంటూ ఆ లోకాన్ని వదిలి తల వంచుకు వెళ్ళిపోయాక, మళ్ళీ ఇప్పుడే కనపడటం. అయినా నీ ప్రాభవం మమ్మల్ని వదలలేదు. తీరా రెక్కలు విప్పిన రివల్యూషనులా నువ్విన్నాళ్ళకి కనపడితే, స్వర్గం అంటున్నావ్, చిత్రగుప్తు డంటున్నావ్, నేను నమ్మని కథలు చెబుతున్నావ్! ఏవేవో సినిమా కబుర్లు చెబుతున్నావ్! అంతా

# కుంతి-కుమారి

అది ఒక రమణీయ పుష్పవనం.

ఆ వనంలో అది ఒక మేడ.

ఆ మేడ మీద, ఒక పక్క, చిన్న వాటా గది.

ఆ గది తలుపులు తెరుచుకున్నాయి.

అందులోనించి ఒక ఇరవై రెండేళ్ళ యువతి బయటకి వచ్చింది. చూడటానికి ఒకప్పుడు బాగా బ్రతికిన మనిషిలాగానే వుంది.

ఆమె పక్కనే, ఒక నాలుగేళ్ళ పాప కూడా వుంది.

తడబడుతున్న కళ్ళతో భయం భయంగా ఆమె మెట్లు దిగుతున్నది. ఆమె కుడి చేతిని గట్టిగా పట్టుకుని, ఎక్కడికి వెడుతున్నదో కూడా అర్ధం కాని ఆ పాప కూడా, నెమ్మదిగా మెట్లు దిగుతున్నది.

చూడగా చూడగా ఆ ఇద్దరిలోనూ పోలికలు స్పష్టంగా కనపడుతున్నాయి. దాంట్లో ఆశ్చర్యమేముంది. వాళ్ళిద్దరూ తల్లీ కూతుళ్ళని తెలుస్తూనే వుంది కదా మరి!

మేడ మెట్లు దిగి, మెల్లగా రోడ్డు మీదకి వచ్చిందామె.

కొంచెం వెనుకగా ఆమె చీర చెంగు పట్టుకుని నడుస్తున్నది పాప.

అప్పుడే చీకటి పొరలు పారిపోయి తెల్లవారబోతున్నది.

ఒంటి మీద చీరలోని చిరుగులలోనుంచి ఆమె శరీరం, చీకటి మబ్బులలో నించి బయటకి రాబోతున్న సూర్యుడిలా బయటికి తొంగి చూస్తున్నది.

ఆ యువతి ఆగకుండా నడుస్తున్నది.

ఆమె వెనుకనే పాప కూడా పరుగెడుతున్నట్టుగా నడుస్తున్నది.

కొంత దూరం నడిచి, ఆమె అక్కడే రోడ్డు మీద ఆగింది.

అది ఒక గుడి. ఆ గుళ్ళో దేవుడు ఇంకా నిద్రపోతూనే వున్నట్టున్నాడు, నిశ్శబ్ధంగా వుంది.

దాని పక్కనే ఒక కళ్యాణ మండపం.

ఆ రాత్రే అక్కడొక పెద్ద కట్నమిచ్చి చేసిన పెళ్ళి, ఘనంగా జరిగినట్టు వుంది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Satyam+Sivam+Sundaram**

* * *